# "అనంగా, అనంగా"

"రాధిగాడిని కాస్త ఆడిస్తూ వుండండి. నేను ఇక్కడున్నట్లు వస్తాను" అని చెప్పి మా కాంతం పక్క ఇంటికి పేరంటానికి వెళ్ళింది పిల్లలను ఆడించటం అంటే నాకు చాలా సరదా. వాళ్ళకు కథలు చెప్పి కబుర్లు చెప్పి, లాలించి ఆడించ గలను.

రాధిగాడిని దగ్గర కూర్చోపెట్టుకొని కథ చెప్పటం మొదలు పెట్టాను. కథకు కథా నడవాలె. అందులో ఒక నీతి ఉండాలె. ఆనీతి వాళ్ళమనస్సుకు పట్టి వాళ్ళ భవిష్యత్ జీవితంలో ఆదర్శమై ఉండాలని నా కోరిక. కథ ఇల్లాగ నడిచింది.

"అనంగా, అనంగా ఒక గొల్లవాడు ఉండేవాడురా నాయనా"

"గొల్లవాడా?"

"ఆ గొల్లవాడు!"

"అంటే"

"అంటే గొర్రెలను కాస్తాడేవాడు"

"అఁహా"

"వాడికి ఓ కొడుకు. వాడిపేరు రామన్న"

"గొల్లవాడిపేరు రామన్నా?"

"గొల్లవాడిపేరు కాదురా. వాడి కొడుకు పేరు రామన్న"

"ఊఁ"

"ఒకరోజున గొల్లవాడు రామన్నను పిలిచాడు"

"ఎవరూ పిలిచింది ?"

"గొల్లవాడు"

"ఎవరినీ ?"

"రామన్నను"

"రామన్న ఎవరూ ?"

"గొల్లవాడి కొడుకు"

"ఊఁహూ"

పిలిచి ఏమన్నాడు అంటే "నాయనా ఆ పొలంలో పనిచేస్తూ వుంటాను అని చెప్పేసరికి రాధాయ్" ఏ పొలంలో అంటూ మళ్ళీ ప్రశ్న వేశాడు. కథ వినాలని వాడికి కుతూహలం కలిగినట్లు తెలుస్తునేవుంది. సంతోషమూ, ఉత్సాహమూ వాడికళ్ళల్లో మెర మెర మెరుస్తూ ఉన్నాయి. ఇంకొకరికైతే ఈ ప్రశ్నలవల్ల విసుగుపుట్టేదేమో కాని నేను మటుకు ఏమీ విసుక్కోలేదు. నాకు పిల్లలతో మాట్లాడటం తెలుసు. అందుకని చెప్పాను "దగ్గరేవున్న పొలంలో" అని. రాధాయి వూఁ కొట్టి తృప్తిపడ్డాడు.

"ఇంకా ఏం చెప్పాడంటే..." అని కథ ముందుకు నడిపించాను.

"ఎవరూ ?"

"గొల్లవాడు"

"అంటే?"

"గొర్రెలను కాసేవాడు"

"గొర్రెలను కాసేవాడు చెప్పాడా? ఎవరితో?"

"రామన్నతో"

"రామన్న ఎవరూ?"

"గొల్లవాడి కొడుకు"

అప్పటికి మా అబ్బాయికి గొల్లవాడు ఎవరైంది ఎవరితో చెప్పిందీ తెలిసిందిగదా అని అనుకొని "నీవు ఈ గొర్రెలను చూస్తుండు. తోడేలుగాని పులిగాని వస్తే కేక వెయ్యి" అని చెప్పాడు అని ఆ వాక్యం పూర్తిచేశాను. రాధాయ మళ్ళీ అడిగాడు.

"ఎవరూ ఇల్లా చెప్పిందీ?"

"గొల్లవాడు."

"ఏ గొల్లవాడూ?"

"రామన్న తండ్రి."

"రామన్న తండ్రి ఏమన్నాడూ?"

"రామన్నను గొర్రెలను కాస్త చూస్తూ వుండమన్నాడు."

"ఎందుకూ చూడటం?"

"ఎందుకా? వాటికేమీ అపాయం రాకుండా."

"ఏమిటి అపాయం?"

తోడేలు, పెద్దపులి అటువంటివి వచ్చి గొర్రెలను ఎత్తుకు పోతవి. అది అపాయం.

"ఎందుకూ ఎత్తుకుపోవటం ?"

"తింటానికి."

"తింటానికా ?"

ఆకలైతే తింటానికి. నీకు ఆకలైతే ఏమన్నా తినవూ ? అల్లాగే అవి గొర్రెలను తింటై.

రాధాయి అప్పటికి ఊ అని తల ఊపాడు. నేను ఓపికగానే ఉండదల్చుకొన్నాను. ఊరికే ప్రశ్నలు వేయకు. చెప్పేది విను అని కసరలేదు పిల్లవాడు ప్రశ్న వేస్తున్నాడూ అంటే అర్థం గ్రహిస్తున్నాడన్నమాట ! కథను వాడు పూర్తిగా అర్థం చేసుకోవాలెననీ, దాని పరమార్థాన్ని వాడు గ్రహించాలని నా కోరిక. అందుకని వాడు వేసిన ప్రశ్నలకుఅన్నిటికీ ఎంతో ఓపికతో వాడికి జబాబు చెప్పాను. ఆకలైతే పులి గొర్రెలను తింటుంది. అని చెబితే వాడు ఇల్లాగ అడిగాడు.

"పులికి ఆకలైతే గొర్రెలను తింటుందా నాన్నా ?"

"ఆఁ తింటుంది."

"బాగుంటుందా నాన్నా."

"ఆఁ దానికి కమ్మగానే ఉంటుంది."

"అయితే నేనుకూడా తింటాను నాన్నా—"

ఛా, మనం తినకూడదు. పెద్దపులి, తోడేలు, అటువంటి జంతువులు తింటై గొర్రెలను.

"అట్లా చెప్పి రామన్న వెళ్ళిపోయినాడు—"

"ఆఁ"

వెళ్ళిపోయిన కాసేపటికి రామన్న పులి, పులి అని పెద్దగా అరిచాడు.

"అయ్యబాబో, పులి వచ్చిందా" ?

"రాలేదు."

"మరి ఎందుకు కేక వేశాడు."

"తమాషాకు."

రాధాయ ఇది విని నవ్వాడు కథ వాడికి స్పష్ట మయింది. నేను కథ ముందుకు నడిపించాను ఉత్సాహంతో.

అప్పుడు, రామన్న తండ్రీ, ఇంకా కొంతమందీ పరు గెత్తుకొని వచ్చారు హడావుడిగా !

"ఎందుకూ" ?

"పులివచ్చిందనుకొని".

"వచ్చిందా" ?

"రాలేదు."

"మరి ఎందుకొచ్చారూ" ?

"నిజంగా పులి వచ్చిందనుకొన్నారు."

"ఎందు కనుకొన్నారూ" ?

"రామన్న కేకేయలేదూ"

"ఏమనీ" ?

"పులి పులి అని".

"ఎందుకు కేక వేశాడూ" ?

"తమాషాకు అని చెప్పలేదురా"!

"ఊం కేకేస్తే" ?

"అంతా వచ్చారు."

"వస్తే" ?

"వచ్చిచూస్తే పులి లేదు."

"ఊ. లేకపోతే ?

లేకపోయేసరికి, "పులి రాకపోతే ఎందుకు కేక వేశావు తప్పు. అబద్ధాలాడకు" అని విసుక్కొని వెళ్ళిపోయారు. "తెలిసిందా ?" అని అడిగాను ఆ అని తల ఊపాడు రాధిగాడు. వాడికి కథ తెలిసిందో లేదో తెలుసుకొందామని ఒక చిన్న ప్రశ్న అడిగాను.

"ఎవరూ విసుక్కొన్నది ?

"రామన్న"

ఛా రామన్న ఎందుకు విసుక్కొన్నాడురా ?

"పులి ఎంతసేపటికి రానందుకు" ?

ఛాఛాఛా. అది కాదురా రామన్న తండ్రీ వాళ్ళూ విసుక్కొన్నారు.

"ఎందుకూ" ?

పులి గిలీ ఏమీ రాందే అనవసరంగా కేక వేసినందుకు.

రాధాయకు అర్థమైనట్టు తలఊపాడు. కథ ఇల్లాగ చెప్పాను మళ్ళీ గొల్లవాడూ వాళ్లూ వెళ్ళిపోయిన తరువాత కాసేపు ఉండి రామన్న మళ్ళీ కేకేశాడు "పులి పులి" అని

"ఎవరూ?"

"రామన్న"

"ఎందుకూ కేకేసింది?"

"మళ్ళీ తమాషాకే!!"

ఈమాట విని రాధాయ పకపకా నవ్వాడు. తమాషాకు పులి పులి అని కేక వేయటం వాడికి వినోదంగా వుండి వుంటుంది. నవ్వి కథ చెప్పమన్నట్టూ ఊ అని తల ఊపాడు.

మళ్ళీ, గొల్లవాడూ, ఆ పొలంలో ఉన్నవాళ్ళూ, అంతా వచ్చారు కర్రలూ గొడ్డళ్ళూ, కత్తులూ పుచ్చుకొని.

ఎందుకూ? అని అడిగాడు రాధాయి బిత్తరపోయి చూస్తూ, ఎందుకేమిటిరా? రామన్న పులి పులి అని కేక వేయలా?

"ఆ వేశాడు."

"ఆ కేక విని నిజంగా పులి వచ్చిందీ అనుకొన్నారు!

"వచ్చిందా?"

"రా లేదు."

"రాకపోతే?"

రాకపోతే ఎందుకు కేక వేశావురా అని వాడిని మళ్ళీ కోపపడి వాళ్ళంతా వెళ్ళిపోయినారు!

"ఎందుకు వెళ్ళిపోయినారు!"

'పులి రా లేదుగా."

"ఎందుకు రాలేదూ?"

ఎందుకు రాలేదేమిటిరా? అప్పటికిరాలేదు. అంతే అన్నాను. రాధిగాడు ఏదో సందేహంగా చూశాడు. పులి ఎందుకు రాలేదా అని కామోలు వాడి సందేహం. నాలో నేను నవ్వుకొని కథసాగించాను. అరేయి అప్పుడేమైందో కథ విను.

"ఆ"

"దానితరువాత కాసేపటికల్లానిజంగా పులివచ్చింది"

"పెద్ద పులా?

"ఆ."

అమ్మయొహ్యా, ఎట్లా వచ్చిందినాన్నా.

"అడవిలోనుంచి ,గాండ్రు గాండ్రుమని అరుస్తూ వచ్చింది"

"భయంవేయలేదూ?"

"వేసింది."

"వస్తే?"

"వస్తే పెద్దగా కేకలు పెట్టాడు పులి పులి అని."

"ఎందుకూ?"

"భయంవేసి."

"ఊ."

"ఎన్ని కేకలు వేసినా తంబ్రీ వాళ్ళూ రాలేదు."

"భయం వేసింది అని కలిపాడు మా రాధాయి.

"ఎవరికిరా?" అని అడిగాను."

వాళ్ళకే!

ఛాఛా అదిగాదు. భయంవేసి కాదూ వాళ్ళు రాక పోవటం! ఇదివరకులాగా తమపాతు రామన్న కేక వేస్తున్నాడను కొన్నారు.

ఊఁ అని రాధాయి బిక్కముఖం వేశాడు.

పులి వచ్చి, రెండు గొర్రెలను ఎత్తుకెళ్ళింది.

ఎక్కడికీ.

అడవిలోకి.

ఎందుకూ?

తింటానికి.

ఊఁ.

ఆ తరువాత గొల్లవాడువచ్చి చూచి ఏడ్చాడు.

ఎందుకు ఏడ్చాడూ?

ఖరీదుగల గొర్రెలు పోయినందుకు.

గొర్రెలు ఏమైపోయినై.

ఆ పులి తినేసింది, రామన్న అయ్యో, నా గొర్రెలు పోయినాయి అయ్యో అని ఏడ్చాడు. చూశావా అబద్ధం ఆడుటవల్ల ఎంత నష్టమో అని పూర్తిచేశాను కథ.

♦ ♦ ♦ ♦

ఇంతలోకే కాంతం పేరంటానికి వెళ్ళివచ్చి, అన్నం పెడతా రా నాన్నా అంటూ రాధాయిని తీసికెళ్ళింది.

అమ్మా, నాన్న మంచి కథ చెప్పారే.

ఏం కథ నాయనా నాకు చెప్పు వింటాను. అన్నది ఆవిడ.

అదికాదే అమ్మ! గొర్రెలున్నాయంటే, ఉంటే రామన్నా...

"రామన్న ఎవర్రా నాయినా!"

"గొర్రెలను కాసే గొల్లవాడి తండ్రి!"

ఆ అయితే...

రామన్న పొలానికి పోయివాడట, వెడితే గొల్ల వాడికి ఆకలైంది. అయితే గొర్రెలను తిందామనుకొన్నాడు గొర్రెలను చంపద్దూ తింటానికి? అందుకని గొర్రెలను చంపటానికి పులిని రమ్మన్నాడట. ఆ పులి ఎంత సేపటికి, రాలేదు. పులీ, పులీ, అని కేకేశాడు; ఎందుకు అట్లాగ కేక వేస్తావు అని తండ్రి కోప్పడ్డాడట. చివరకు పులి మెల్లగా వచ్చేసి రెండుగొర్రెలను తీసుకొని అడవిలోకి వెళ్ళిపోయింది: గొల్లవాడు పులీ, గొర్రెలనుతిన్నారు. రామన్న ఏడ్చాడట!

ఎందుకురా ?

వాడికి లేకుండా తిన్నారని కాబోలు—

ఈ కథ వింటూ వరాండాలో ఉన్న నేను, వంట ఇంట్లోవున్న కాంతం ఒక్కసారే నవ్వాము—

---